శాశ్వత షెడ్ల నిర్మాణమెప్పుడో?

- ప్రాచుర్యం పొందిన కట్టమైసమ్మ బోనాలు
- గత ప్రభుత్వం హామీ ఇచ్చినా.. ఆచరణకు నోచని వైనం
- కాంగ్రెస్ సర్కారైనా పట్టించుకోవాలని భక్తుల వేడుకోలు
- సరిపోని నామమాత్రపు షెడ్లు?
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో యాత్రికులు

కవాడిగూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతిష్ఠాత్మకమైన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద శాశ్వత షెడ్ల నిర్మాణం జరపాలని భక్తులు కోరుతున్నారు.

విషయానికొస్తే.. 2014లో రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలో కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తులు రోడ్లపై వండుకొని పూజలు చేయాల్సిన దుస్థితి. అప్పటి సీఎం కేసీఆర్ భక్తుల కోసం షెడ్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చారే గానీ ఆచరణలో అమలు కాలేదు. అప్పుడు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు.



తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)



కనకాల కట్టమైసమ్మ దేవాలయం

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇప్పుడైనా ఆలయానికి కూత వేటు దూరంలో ఉన్న స్థలంలో తాత్కాలిక షెడ్లకు బదులుగా శాశ్వత షెడ్‌లు నిర్మించాలని కోరుతున్నారు. రెండు మూడు వారాలు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత ఈ స్థలాన్ని ప్రస్తుతం టూరిజం శాఖకు కేటాయించినట్లు బోర్డు పెడ్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆషాఢ మాసం బోనాల పండగలో భాగంగా బోనాల మొక్కులు చెల్లించుకునే వారందరికీ షెడ్లు సరిపోకా రోడ్లపై టెంట్లు వేసుకొని నానా ఇబ్బందులు పడుతున్నారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు స్పందించి వాటిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

● ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల పండగ తర్వాత రెండవ వారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

సమస్యను పరిష్కరించాలి



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత షెడ్‌ల ఏర్పాటుకు కృషి చేయాలి. ఈ విషయంలో పలు సందర్భాల్లో ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులను కోరాం. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తగిన విధంగా స్పందించి సమస్యను పరిష్కరించాలి.

గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్,
కనకాల కట్టమైసమ్మ ఆలయ ఫౌండర్ చైర్మన్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కవాడిగూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకు వస్తామని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం అరవింద్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికలకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రేవంత్‌రెడ్డి సర్కార్ మాట నిలబెట్టుకొందని స్పష్టం చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు చౌరస్తాలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, మేడి సురేష్, మారిశెట్టి నర్సింగ్‌రావు, అతినగరం సుధేష్, సంగపాక వెంకట్, వెంకటేష్‌గౌడ్, విజయ్‌యాదవ్, జగదీష్, సాయిబాబా, నరేందర్, బాబురావు, తిరుమల్ పాల్గొన్నారు.

గద్వాల విజయలక్ష్మి మాదిగలకు క్షమాపణ చెప్పాలి

- నగర ఇన్‌చార్జి వెంకటస్వామిమాదిగ

కవాడిగూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాదిగలకు క్షమాపణలు చెప్పాలని తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామిమాదిగ డిమాండ్ చేశారు. జూలై 7న సంఘం సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూబ్లీ హిల్స్ నియోజకవర్గం ఎన్‌బీటీ నగర్‌లో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను ఆమె ఆదేశాల మేరకు కూల్చివేయడం సరికాదన్నారు. శుక్రవారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌సీ దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మేయర్ మాదిగ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మేయర్ ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు నరసింహారావు మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం నగర అధ్యక్షుడు మర్మాముల జహంగీర్, ఎంఎస్ఎఫ్ మాదిగ విద్యార్థి సంఘం నగర అధ్యక్షుడు జనపాల మహేష్, జిల్లా అధికార అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్‌మాదిగ, సీనియర్ నాయకులు విజయరావు, శ్రీకిషన్, శివకుమార్, సుజాత, రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటను తీర్చిదిద్దుతాం

నల్లకుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజోపయోగం కోసం తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం డివిజన్‌లోని బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనుల నమూనాను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న బతుకమ్మకుంట ఎట్టకేలకు న్యాయస్థానం ఆదేశాలతో ప్రభుత్వం, ఉన్నతాధికారులతో నేడు ప్రజోపయోగంలోకి రానున్నదన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి

రూ.10 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులు

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజవర్గంలోని ఐదు మునిసిపల్ డివిజన్‌లలో పదికోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వెల్లడించారు. మరో పదికోట్ల రూపాయల ప్రతిపాదనలను సైతం రూపొందించి ప్రభుత్వానికి పంపామని నిధులు విడుదల కాగానే ఈ పనులను కూడా చేపడుతామని తెలిపారు. నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లలో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభయ్యాయని తెలిపారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పర్వారీస్ బాగ్‌లో 29 లక్షల రూపాయలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో మూడు కోట్లతో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని, నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని ఆ నిధులు విడుదలయ్యాక పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎర్రబీష్మదేవ్, నేతలు దాత్రిక్‌నాగేందర్ బాబ్జి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ డివిజన్ పర్వారీస్‌బాగ్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మ్యాన్‌హోల్స్ మరమ్మతు పనులు

నల్లకుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : బోనాల పండగను పురస్కరించుకుని అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల సమీపంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు డ్రైనేజీ లీకేజీ, కుంగిపోయిన మ్యాన్‌హోల్స్ వెలగని వీధిదీపాలు ఇతరత్ర సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ పాములబస్తీ, పోచమ్మబస్తీలలో కుంగిపోయిన మ్యాన్‌హోల్స్ సమస్యపై స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు శుక్రవారం బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కే మహేష్‌కుమార్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బంది ఈ ప్రాంతానికి వచ్చి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పోచమ్మబస్తీలో మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతు పనులు చేపడుతున్న జలమండలి సిబ్బంది

మందకృష్ణ మాదిగకు సత్కారం

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇటీవల పద్మశ్రీ అవార్డు పొందినందునుకు గాను ఆలిండియా ఆరెకటిక సంఘం సంరక్షక్ జాతీయ కార్యదర్శి నితికర్ ప్రేమ్‌లాల్‌జీ.. ఆయన్ను సత్కారించారు. ఆదివారం తెలంగాణ ఆరెకటిక సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మందకృష్ణ ను ఆయన నివాసంలో కలిసి శాలువా పూలబొకేను అందజేసి అభినందనలు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ కేవలం మాదిగల పోరాటం మాత్రమే కాదని న్యాయం కోసం సాగిన మహత్తర ప్రజా స్వామ్య ఉద్యమమని ఆయన కొనియాడారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం చేసిన పోరు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ ఆరెకటిక రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల పుష్పరాజ్‌జీ మాట్లాడుతూ, పేద కుటుంబాలకు చెందిన హృద్రోగ బాధిత పిల్లలకు ఆదుకోవాలంటూ భారీ ర్యాలీ నిర్వహించి మందకృష్ణ మాదిగ విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వాదులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆరెకటిక సంఘం ప్రతినిధులు చుకంద సూర్య, కె.జానకిరామ్, ప్రకాష్, ఎం ఘన్‌శ్యామ్, జి శివానంద్, జి వేణుగోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణమాదిగను సత్కరిస్తున్న ఆలిండియా ఆరెకటిక సంఘం సంరక్షక్ జాతీయ కార్యదర్శి నితికర్ ప్రేమ్‌లాల్‌జీ

సంస్కృతీ సంప్రదాయాలు విశ్వవ్యాప్తం కావాలి

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలు విశ్వవ్యాప్తం కావాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ అన్నారు. వారం రోజులుగా విదేశీపర్యటనతోపాటు మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న పలు ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించి రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. యువత విదేశీమోజులో పడకుండా మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడాలని ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయనను టీడీపీ నేతలు పలువురు సన్మానించారు.

బోనాల పండుగ ఏర్పాట్లపై సమీక్ష

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రానున్న బోనాల పండగ ఏర్పాట్లపై శుక్రవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ ఆయన కార్యాలయంలో సమీక్షించారు. ఈనెల 20న జరిగే తెలంగాణ బోనాల పండగ ఉత్సవాల కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరిగే ఏర్పాట్లు, డివిజన్‌ల పెండింగ్ అభివృద్ధి పనులపై చర్చించారు. జీహెచ్ఎంసీ ద్వారా ముందస్తు పండుగ ఏర్పాట్లను పూర్తిచేసేందుకు అధికారులను ఆదేశించాలని కార్పొరేటర్ కోరారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధిపనులను పూర్తిచేసేందుకు సహకరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ రవికిరణ్.. బోనాల పండగ ఏర్పాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



బోనాల ఏర్పాట్లపై జోనల్ కమిషనర్‌తో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పావని



ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాలకు జిల్లా వైద్య శాఖ ఉత్తమ ఉద్యోగి అవార్డును అందజేస్తున్న జిల్లా వైద్యశాఖ అధికారి వెంకటి తదితరులు

రత్నమాలకు ఉత్తమ ఉద్యోగి అవార్డు

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాల జిల్లా స్థాయిలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి.. ఆమెకు సర్టిఫికెట్ , జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ కరోనా సమయం నుంచి విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు గాను అవార్డు దక్కడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అవార్డు జిల్లా స్థాయిలో రావడం మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు తుకారం, జయమాలిని, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిసిన ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకుడు పి. శ్రీధర్‌చారి తదితరులు

సేవా, ఆధ్యాత్మిక భావనతోనే గుర్తింపు

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి తాను ప్రతి నెలా చేపడుతున్న అన్నదాన కార్యక్రమాలు, సద్గురు సాయిబాబా స్వామివారి సామూహిక పూజలు, లలిత పారాయణాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయనను గోపాల్ అభినందిస్తూ సన్మానించారు. సేవా కార్యక్రమాలలో ముందుంటూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, రామకృష్ణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గాయపరిచి నగదు దోచుకెళ్లిన నిందితుడికి రైల్వే కోర్టు రెండేళ్ల కఠిన కరాగార శిక్ష విధించింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 2017 డిసెంబర్ 23న సాయంత్రం 4 గంటల సమయంలో ఓవ్యక్తి యాకత్‌పుర - డబీర్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. చంచల్‌గూడకు చెందిన మహ్మద్ నోమన్ అలియాస్ నోమన్ ఆఫ్రిదీ (27) బ్లేడ్‌తో దాడి చేసి, వెయ్యి రూపాయల నగదు దోచుకెళ్లాడు. అప్పుడు బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు రాగా మేజిస్ట్రేట్ ఎస్.శ్రీదేవీ ఈ కేసులోని నిందితుడికి రెండేళ్ల జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న పర్సు, గోల్డ్‌చైన్ బాధితురాలి చెంతకు

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న పార్సుతోపాటు గోల్డ్‌చైన్ తిరిగి బాధితురాలికి చెంతకు చేరాయి. ఓ వ్యక్తి తనకు దొరికిన వీటిని పోలీసులకు అప్పగించారు. విషయానికొస్తే.. పటాన్‌చెరుకు చెందిన నందినికుమారి, భరత్ రాజ్ దంపతులు. ఇద్దరు కలిసి ఈనెల 9న బాగ్‌లింగంపల్లి శ్రీరామ్‌నగర్‌లో నివసించే నందినికుమారి సోదరి ఇంటిలో నిర్వహిస్తున్న పూజ కార్యక్రమానికి వచ్చారు. కారు దిగిన తర్వాత నందినికుమారి తన 8 తులాల బంగారు గొలుసున్న పర్సు పోగొట్టుకున్నారు. కొద్ది సేపటికి తెలుసుకొని వెంటనే చిక్కడపల్లి క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తుండగా.. శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన పి. శివకుమార్‌కు పర్స్ దొరికిందని గొలుసుతో పాటు పర్సును వారికే అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్‌కుమార్.. శివకుమార్‌ను సన్మానించారు. బాధితురాలిని పిలిపించి వాటిని అందజేశారు. పోలీసులకు, శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మూర్ఛతో వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్‌తో చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కడప జిల్లాకు చెందిన రవికుమార్ నగరానికి వచ్చి కాచిగూడ పరిసర ప్రాంతాలలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జాము ఫిట్స్ రావడంతో 108 సర్వీసులో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఢిల్లీకి టీడబ్ల్యూజేఎఫ్ బృందం

నల్లకుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలపై ఢిల్లీలో జరిగే సమావేశంలో జాతీయ వ్యవహారాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్యలు వెల్లడించారు. శుక్రవారం ప్రతినిధి బృందం హైదరాబాద్ నుంచి రైలులో ఢిల్లీకి బయలుదేరిందని వారన్నారు. ఈ నెల 12న ఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియా భవన్‌లో ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ సమావేశం జరుగుతోందన్నారు.

బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి సన్మానం

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాంచందర్‌రావును భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ , నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుక్రవారం సన్మానించారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచించారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన మోసాలను ఎండగడుతూ పార్టీని మరింత బలమైన శక్తిగా మార్చాలన్నారు. రాంచందర్‌రావును కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్ విశ్వం, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్, దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, రాంచందర్‌రావుకు శాలువాలు కప్పి సన్మానించారు.



రాంచందర్‌రావును సన్మానించిన విశ్వం, బిజ్జి కనకేష్ కుమార్, నందగిరి నర్సింహ తదితరులు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్ హరినగర్ అబ్బసాయి మెన్షన్ నుంచి ఎస్ఆర్‌టీ పార్కు వరకు గల రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బస్తీవాసులు ముదిగొండ మురళి, పిరంగి.నాగరాజు, పి.విజయకృష్ణలు కోరారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో స్థానికంగా ఉంటున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు శుక్రవారం తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, జీహెచ్ఎంసీ డీఈ గీతకు విన్నవించినట్లు తెలిపారు. వారం రోజుల్లో వాటిని ఏర్పాటు చేయకపోతే జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో ఆసుపత్రి నుంచి బోనాలను తీసుకుని ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో అమ్మవారికి సమర్పించారు.

14న కలెక్టరేట్ల ముట్టడి

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత వృత్తిలో ప్రమాదానికి గురైన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం ఈ నెల 14న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కలెక్టరేట్ల ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

కూల్చిన మడిగెల ఘటనపై విచారణ జరిపించాలి

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ అనుమతి లేకుండా చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో కూల్చిన మడిగెల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్‌కు శుక్రవారం అఖిలపక్షం నేతల వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు లోకేష్‌యాదవ్, బీజేపీ నగర నాయకుడు జైపాల్‌రెడ్డి, టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, వైదిక కమిటీ సభ్యులు వరదరాజు స్వామిలు మాట్లాడారు. ఈ విషయంపై కోర్టులో వివాదం కొనసాగుతుండగానే చైర్మన్ మూడు రోజుల క్రితం రాత్రి మడిగె కూల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు.

యోగా గురువుకు సన్మానం

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌కు చెందిన యోగా గురువు కె.మధును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు శాలువాతో సత్కరించారు. గురుపౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. అంబర్‌పేట, షాదాన్ కాలేజ్ పరిధిల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, బౌద్ధనగర్ పరిధిలో 11 నుంచి 11.30 వరకు, ప్లేగ్రౌండ్, జెడ్‌పీ ఆఫీస్, లేక్‌వ్యూ ఎస్ఎస్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాఉండదని పేర్కొన్నారు.